# వయసు మందాకిని

## తాడేపల్లి పతంజలి

మందాకిని మనసు మంచిది.

నడత కూడా మంచిదే.. కాని ఇటీవల వచ్చిన వయసు ఆమె ప్రవర్తనలో మార్పు తేవటానికి బహుథా యత్నిస్తోంది. 'ముందొచ్చిన చెవుల కన్నా వెనుక వచ్చిన కొమ్ములు వాడి.'

"అమ్మాయ్! మందాకినీ..."

"ఆ.." వినుక్కుంటూనే తల్లికి జవాబు.

చదువుతున్నది మంచి రొమాంటిక్ నవల హీరో, హీరోయిన్‌తో అవస్థలు పడుతున్నాడు.. ఆవిడని 'ఆ' రహదారిపైకి నడిపించాలని.. నెమ్మది నెమ్మదిగా హీరోయిన్ రహదారిపైకి చేరుతున్న సమయంలో... పానకంలో పుడకలా తల్లి పిలుపు...

ఏ దయినా భరిస్తుందేమో కానీ, రొమాంటిక్ సీక్వెన్సీ చదవటం భగ్నం చేస్తే అసలు భరించలేని తప్పు ఆమె వయసుది.

"తమ్ము డింకా స్కూల్నుంచి రాలేదు. ఒక సారి కొట్టుకెళ్ళి కొబ్బరికాయ ఒకటి తీసుకురా..."

"ప్చ్.." వినుక్కుంటూ లేవక తప్పింది గాదు మందాకినికి. స్థానభ్రంశం చెందిన పయ్యెదను చిరాగ్గా సవరించుకొంది. నిలువెత్తు అద్దం ముందు నిలబడి మన్మధుడు వివిధ భంగిమల్లో కవాతు చేస్తున్న శరీరాన్ని పరిశీలనగా చూసుకొంది. తన అందం చూసి పరిపరి విధాల మురిసిపోతూ, పౌడరు అద్దుతుండగా, తల్లి మరో సారి వినుక్కుంది.

"అబ్బబ్బా.. షోకులు చా ల్లేవే. తొందరగా వెళ్ళిరా.." తల్లి మంగ ళాశీస్సులతో బయటికి కదిలింది.

ఆమె బయటకు వచ్చిన మరు క్షణంలో ఆ బజారులో 'నూనూగు మీసాల నూత్న యౌవనంలో అడుగు బెట్టిన వారు మొదలు 'ప్రౌఢ నిర్భరవయః పరిపాకము''న ఉన్న వారి వరకు - చాలా మంది రక్తాల్లో 'వేడి' ప్రారంభమైంది.

కన్నులకు స్పర్శించే గుణం లేకపోయినందుకు చాలా బాధపడ్డాడు ఆ బాధితులలో ఒకడైన కమలమోహన్. చదివిన కోర్సే మళ్ళీ చదువుతూ, కాపీ కొట్టినా ప్యాసు చేయని యూనివర్సిటీని శపిస్తూ పదే పదే అభ్యాసం చేస్తే విద్య పెరుగుతుందన్న సూత్రాన్ని బాగా నమ్మి, ఇరవై ఎనిమిదేళ్ళ వయసులో డిగ్రీ కోసం ఇంకా నార్మల్ డిగ్రీకి రాని శరీర ఉష్ణోగ్రతతో చాలా తంటాలు పడుతున్నాడు.

మంటాకిని ఇంటి ప్రక్కల్లే డబ్బు వాసన గల అతని ఇల్లు. ఏ దుర్ముహూర్తంలో [మందాకినికి] మందాకినిని చూసాడో గాని, కమలమోహన్ మనస్సు 'లవ్ ట్రాక్'లో పడింది. అతడికి మందాకినిని పెళ్ళి చేసుకోవాలనే ఆశ ఏ కోశానా లేదు. కేవలం పీల్చి పిప్పిచేసి దూరంగా విసిరివేసే జాతి వారసు డతడు.

*** *** ***




మందాకిని కొబ్బరికాయల కొట్టు దగ్గరికి వచ్చింది. కమలమోహన్ కూడా ప నున్న వాడిలా ఆమెను అనుసరించాడు.

"ఏం కావాలమ్మా" పండ్ల వ్యాపారి ప్రశ్నించాడు.

"కొబ్బరికాయ.." తన గొంతు తడబడటం తనకే ఆశ్చర్య మనిపించింది మందాకినికి.

"ఇదుగో తీసు కోండమ్మా.." చిన్న కాయ తీసి ఆమెకు ఇవ్వబోయాడు కొట్టు వాడు.

"ఎంత..?" మందాకిని ప్రశ్నకు 'మూడివ్వం డమ్మా.." అన్నాడు కొట్టు వాడు.

ఆ నిమిషంలో రంగ ప్రవేశం చేశాడు కమలమోహన్.

"భలే వాడివేలే.. అంత చిన్న కాయ మూడా.. ఏం... మా కేమి తెలియదనుకొన్నావా?" మందాకిని అడగక పోయినా వకాల్తా పుచ్చుకుని ప్రశ్నించాడు కమలమోహన్.

"అది కాదండి.. ఈ మధ్య పెరిగాయండి.." అంటూ కొట్టు వాడు ఏదో ననగబోతుంటే దబాయించాడు కమలమోహన్. "చాలు చాల్లే.. రూపాయ్ ఇస్తారు తీసుకో.. ఆ కాయ కంతకంటే అనవసరం.." అంటూ కొట్టు వాడికి అర్థమయ్యే రీతిలో తల త్రిప్పుతూ అన్నాడు కమలమోహన్.

మిగిలిన డబ్బు లెలాగూ తనకు తర్వాత వస్తాయని అనుభవ పూర్వకంగా తెలిసిన కొట్టు వాడు "అలాగే నమ్మా.. ఆ బాబు గారు చెప్పినట్లే తీసుకోండి" అన్నాడు.

మందాకిని రూపాయి ఇచ్చి కొబ్బరికాయ తీసుకొని, తక్కువ ధరకి తెచ్చినందుకు అమ్మ పొగడ్తలు తలుచుకుంటూ రెం డడుగులు వేసిన తర్వాత, వెనకనే ఉన్న కమలమోహన్‌తో నెమ్మదిగా అంది 'థాంక్సండి.."

"వెల్‌కమ్" అంటూ చిరునవ్వు నవ్వాడు కమలమోహన్. మందాకిని ముందుకు నడుస్తుంటే అత నిలా అనుకొన్నాడు. "బండి లైను మీదికి రావటం కష్టం.. లైను మీదికి వచ్చిన తర్వాత వెంటనే కాకపోయినా, కొంత ఆలస్యమయిన తర్వాతయినా కదిలి తీరుతుంది."

*** *** ***

కమలమోహన్ దగ్గర డబ్బు కన్నా ఇతరులను ఆకర్షించే చక్కటి గుణం మరొకటుంది. అది మోహనమైన చిరునవ్వు. తీర్చిదిద్దినట్లుండే పొందికైన పలు వరుస అతనిది. అతని నగు మోము కనీసం ఒక నిమిషమయినా పరిచయం లేని ఎదుటి వ్యక్తి గుండెల్లో తిష్ట వేసికు తీరుతుంది. పరిచయస్తుల సంగతి వేరే చెప్పనవసరం లేదు.

మళ్ళీ... మందాకిని రెండు చోట్ల తారసబడ్డాడు కమలమోహన్.. తనకున్న చిరునవ్వు సమ్మోహనాస్త్ర ప్రయోగం చేశాడు. ఇంటికి వచ్చిన మందాకినికి గుండెల్లో గుబులు పెరగటం ప్రారంభించింది. వయసు చుట్టూ మనస్సు ప్రదక్షిణాలు చేయటం ప్రారంభించింది. ఆ చిరు నవ్వుల రహదారి మాటల తీరానికి చేరటానికి మరో మూడు నెలలు పట్టింది.

ఆ సందర్భంలోనే ఇంటర్ మీడియట్ ప్లానయింది మందాకిని.

పార్టీ ఇస్తానన్నాడు కమలమోహన్. "ఊహు.. వద్దు.. ఇప్పటికే సాయంత్రపు ఆలస్యాలకి అనేక అబద్ధాలు చెప్పుకోవలసి వస్తోంది. ఇంకా లేటయితే.. అయ్యో.. బాబోయ్.." కళ్ళు విశాలం చేసి మందాకిని అంటుంటే కమలమోహన్ మనస్సు 'వసంతగీతం' పాడింది.

"పోనీలే.. ఎలాగూ అబద్ధాలు తప్పటం లేదు. ఇవాళ్టి కొక్క రోజుకి ఇంకొకటి.." కమలమోహన్ అన్నాడు.

"ఊహు.. అదేం కుదరదు. నేను వెళ్ళాల్సిందే.." బుంగమూతి పెడ్తూ అంది మందాకిని.

"ఊహూ.. అదేం కుదరదు.." ఆమె మాటలనే అనుకరిస్తూ కమలమోహన్ అన్నాడు. ఒక అయిదు నిమిషాల చిలిపి పోట్లాట తర్వాత ఇద్దరూ ఒక అంగీకారానికి వచ్చారు. దగ్గర్లోని రెస్టారెంటులో టిఫిను, కాఫీ తీసుకొని విడిపోదామని.

వాళ్ళు అనుకున్నకార్యక్రమం పూర్తిగావస్తుండగా హఠాత్తుగా వర్షం మొదలయింది. నల్లటి మేఘాలు క్రమ్ముకొన్న ప్రకృతి చెదిరిన ఆడపిల్లలా, తీవ్రమైన గాలులతో, అల్లకల్లోలంగా పిడుగుల ఆర్తనాదాలు చేస్తోంది.

వర్షం కురవటం మొదలయి గంటయినా తెరిపి లేదు. విడవకుండా కురుస్తూనే ఉంది. ఇంతలో ఆ లాడ్జి కమ్ రెస్టారెంట్ క్యాష్ కౌంటర్‌లో కూర్చున్నతను కమలమోహన్ దగ్గరికి వచ్చి విష్ చేసి "సార్.. వర్షం ఇంకా తగ్గేట్లు లేదు.. పైన లాడ్జిలో 101 నెంబరు రూము శుభ్రం చేయించాను. రెస్ట్ తీసుకొని వర్షం తగ్గాక వెళ్ళండి" అన్నాడు.

కమలమోహన్ థాంక్స్ చెప్పిన తర్వాత అతను వెళ్ళిపోయాడు.

"ఇతను నాకు బాగా తెలిసిన వాడులే... పైకి వెళ్దామా.." అన్నాడు కమలమోహన్.

"ఊహు మన మిక్కడే కూర్చుందాం.." మందాకిని మొండిగా అంది. రెస్టారెంటులో జనం ఎక్కువగా లేరు. అక్క డక్కడా విసిరివేసినట్లు ఇద్దరు ముగ్గురున్నారు.

వాళ్ళనే అనుసరించి, వాళ్ళతోపాటు రెస్టారెంటులో మూలగా కూర్చున్నతను కమలమోహన్ కేసి, మందాకిని కేసి చాలా ఆసక్తిగా, కావలసిన వాడిలా చూస్తున్నాడు. కమలమోహన్ ఈ విషయం గమనించలేదు.

"అది కాదు మందాకినీ.. జస్ట్.. అలా వెళ్ళి వర్షం తగ్గిన వెంటనే వచ్చేద్దాం. వెచ్చగా ఉంటుంది.." కమలమోహన్ నచ్చ చెబుతున్నట్లుగా అన్నాడు.

అతని గొంతులో ఎంత దాచు కొందామన్నా దాగని వణుకు లీలగా ప్రతి ధ్వనిస్తోంది. 'వద్దు మోహన్... ఇక్కడే కూర్చుందాం..' మందాకిని పట్టిన పట్టు విడవలేదు.

కొన్ని నెలలుగా తను వేసుకున్న 'ప్రణాళిక' ఈ రకంగా .ఫలించే అవకాశం వస్తే, ఇది వృధా కావడం ఇష్టం లేకపోతోంది కమలమోహన్‌కి. మందాకిని చేయి పట్టుకొన్నాడు. అతని చొరవకు



ఆశ్చర్యపోయింది ఆమె. ఆమె సున్నితమైన వ్రేళ్ళల్లో రక్త సంచారం ఎక్కువయింది.

మందాకిని కళ్ళు తమ వైపు దీక్షగా చూస్తున్నతని వైపు తిరిగాయి. "నేను చెప్పింది నిజమే అవుతోంది కదూ!" అన్నట్లు చూస్తున్నా డతడు.

"ప్లీజ్.. లీవ్ మీ.." గొంతులో రాబోతున్న వణుకును అణుచుకుంటూ అందామె. కమలమోహన్ చేతులు మరింతగా బిగుసుకున్నాయి.

అతనికి బాగా తెలిసిన రెస్టారెంటు. ఎన్నో చేతులను పట్టుకొన్న క్రూరమైన అనుభవం. నెమ్మదిగా ఆమెను పై అంతస్థుకు వెళ్ళే మెట్ల వైపు ఈడ్చటానికి ప్రయత్నిస్తున్నాడు.

సరిగ్గా అప్పుడే కరెంట్ పోయింది. వర్షపు జోరు హెచ్చింది.

దూరాన ఎక్కడో ఉరుము ఉరిమి, మెరుపు మెరిసింది. కమలమోహన్ చెంప ఫెడీల్మంది. మందాకిని చేతి దెబ్బ.

అంత బలం తన చేతిలోకి వచ్చినందుకు మందాకిని ఆశ్చర్య పోయింది. కమలమోహన్ నంబాళించుకుని 'యూ' అంటూ ఏదో చేయబోయాడు.

మళ్ళీ వెంటనే కరెంట్ వచ్చింది.

అప్పటికే మందాకిని చుట్టూ చేరారు ముగ్గురు బలిష్ఠులు.. అందులో ఇందాక మందాకినిని దీక్షగా చూసిన వాడు కూడా ఉన్నాడు. అతడు మందాకిని అమ్మ తమ్ముడు ప్రభాకర్. మిగతా ఇద్దరూ అతని స్నేహితులు కరాటే ఫైటర్లు.

"స్వచ్ఛందంగా ప్రేమించే వారు లేరనను కాని, కాముకతను తీర్చుకోవటానికి రంగ స్థలంగా ప్రేమని ఉపయోగించుకొని మోసం చేసే వాళ్ళే ఎక్కువ. నీ లాంటి ఆడపిల్లలు జాగ్రత్తపడవలసినది ఈ వయసులోనే నమ్మా.. సమయానికి మేము రాకుండా ఉంటే ఈ చీకటి రాత్రిలో ఈ అపరిచిత స్థలంలో ఏమయ్యే దానివి..?"

ప్రభాకర్ మాటలకు సిగ్గుతో తల దించుకొంది మందాకిని.

కమలమోహన్‌ది ప్రేమేనని, కామం కాదని ప్రొద్దున్న మామయ్యతో మాట్లాడిన విషయం గుర్తొచ్చింది.

"క్షమించు మామయ్యా! తప్పుగా అన్నాను.". మందాకిని మాటలను వారిస్తూ అన్నాడు ప్రభాకర్ "పదమ్మా... వెళదాం..."

వెళుతూ, వెళుతూ కమలమోహన్‌కేసి చూసింది. ఒంట్లో ఉన్న నీరంతా ఉమ్మిగా మార్చి, అతని మీద వేయాలనుకొంది.

కమలమోహన్ దెబ్బతిన్న పిచ్చి కుక్కలా చూస్తున్నాడు. ◆